క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని గొల్లగూడలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ లైన్ మరమ్మతు పనులు జరుగుతున్నందున వివిధ కాలనీల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ నవీద్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్, డాక్టర్స్ కాలనీ, గ్రీన్ ల్యాండ్ ఆస్పత్రి ఏరియా, గొల్లగూడ, రామ్‌నగర్, బీటీఎస్, ఆర్టీసీ కాలనీ, క్రాంతినగర్, పద్మావతి కాలనీ, దారుషాష కాలనీల్లో ఉదయం 8:30 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

బీఎస్పీ ఇన్‌చార్జ్‌గా ప్రభుదాస్


నియామకపత్రం అందుకుంటున్న ప్రభుదాస్

చండూరు: బహుజన సమాజ్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా చండూరు మండలం దోనిపాముల గ్రామానికి చెందిన నేరెళ్ల ప్రభుదాస్ నియమితులయ్యారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ ఆదేశాల మేరకు పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఏకుల రాజారావు ఆదివారం ప్రభుదాస్‌కు జిల్లా కేంద్రంలో నియామక పత్రం అందించారు.

బీఎస్పీ అధ్యక్షుడిగా వినోద్



నాంపల్లి: మండలంలోని మల్లపురాజుపల్లి గ్రామానికి చెందిన పల్లేటి వినోద్‌కుమార్ బీఎస్పీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలో వినోద్ కుమార్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏకుల రాజారావు నియామక పత్రం అందజేశారు.

శాలివాహన సంఘం అధ్యక్షుడిగా జానయ్య

చిట్యాల: వెలిమినేడు గ్రామ శాలివాహన(కుమ్మరి) సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన ఆ సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా అర్రూరి జానయ్య, ఉపాధ్యక్షుడిగా అర్రూరి నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా అర్రూరి జంగయ్య, డైరెక్టర్లుగా అర్రూరి రాములు, అర్రూరి లింగస్వామి, అర్రూరి రమేష్, అర్రూరి శ్రీను, బొడ్డుపల్లి శ్రీకాంత్, ఏరుకొండ బసవయ్య, అర్రూరి ధనుంజయ, అర్రూరి స్వామిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ సర్పంచ్ అర్రూరి వీరయ్య, మాజీ ఎంపీటీసీ అర్రూరి శ్రీను, అర్రూరి శ్రీశైలం, అర్రూరి శివ, అర్రూరి ఎట్టయ్య, అర్రూరి మల్లయ్య, అర్రూరి పెంటయ్య పాల్గొన్నారు.

కట్టంగూర్ వాసికి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న లక్ష్మయ్య

కట్టంగూర్ : మండల కేంద్రానికి చెందిన వంగూరి లక్ష్మయ్య అయ్యప్పస్వామి సేవారత్న పురస్కారానికి ఎంపికయ్యారు. శ్రీ అయ్యప్ప స్వామి ఐక్యవేదిక నవమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో లక్ష్మయ్యకు ఆ వేదిక మహా సంస్థాన పీఠాధిపతి శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య అవార్డు అందజేశారు. అనంతరం లక్ష్మయ్య మాట్లాడుతూ తాను 32 పర్యాయాలు శబరి యాత్ర చేశానని, శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా, అఖిల భారత అయ్యప్ప ప్రచార సేవా సమితి సలహాదారుడిగా పనిచేస్తున్నానని తెలిపారు.

వీధి గ్రంథాలయం ప్రారంభం

నల్లగొండ టౌన్ : సేవా భారతి నల్లగొండ ఆధ్వర్యంలో పట్టణంలోని అర్బన్ కాలనీలో ఆదివారం టూ టౌన్ పోలీసులు వీధి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బంటు జనార్దన్, వంజర స్వామి, షంషోద్దీన్, సాగర్, నాగేశ్వర్‌రావు, భీమనపల్లి శ్రీకాంత్, ప్రసాద్ రాథోడ్, రాజు, ధరావత్ క్రాంతి, రాము, గణేశ్, శివ, కృష్ణయ్య పాల్గొన్నారు.

పోలీసులకు పట్టుబడిన దొంగ

నల్లగొండ క్రైం: పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల సూర్యవంశీ కాలనిలో కూసుకుంట్ల అంజిరెడ్డి నివాసంలో చోరీకి పాల్పడిన కనగల్ మండలంలోని జి.యడవల్లి గ్రామానికి చెందిన రుద్రాక్షి శ్రీనును వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద రూ.40 వేలు, 2 తులాల బంగారం, వెండి కుందులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 23న అంజిరెడ్డి తన ఇంటికి తాళం వేసి శుభకార్యానికి వెళ్లాడు. 25వ తేదీన అతడు తిరిగి ఇంటికి వచ్చి చూడగా బంగారం, నగదు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దొంగ కోసం గాలిస్తుండగా.. రుద్రాక్షి శ్రీను దేవరకొండ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్ సిబ్బంది పట్టుకుని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. అతడిపై గతంలో పలు దొంగతనం కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు.

ఇటు వ్యథ.. అటు వృథా !


అడుగంటిన శాలిగౌరారం ప్రాజెక్టు


తుర్కపల్లి వద్ద రాచకాల్వ నుంచి మూసీలోకి వృథాగా పోతున్న వరదనీరు

- తుర్కపల్లి వద్ద మూసీ నదిలోకి వృథాగా పోతున్న వరదనీరు
- డెడ్ స్టోరేజీకి చేరిన శాలిగౌరారం ప్రాజెక్టు
- సాగు నీరందక ఎండుతున్న ఆయకట్టు పంట భూములు

శాలిగౌరారం: మూసీ నది వరద నీటితో కలకలలాడే శాలిగౌరారం ప్రాజెక్టు ప్రస్తుతం నీరులేక డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ప్రాజెక్టుపై ఆధారపడి పంటలు సాగుచేసిన రైతులు సాగునీరందక ఆ పంటలు పొట్ట, కంకి దశలో ఎండిపోతుండడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మూసీ నది నుంచి రాచకాల్వ ద్వారా వరద నీరు వస్తున్నప్పటికీ తుర్కపల్లి సమీపంలో రాచకాల్వకు ఉన్న షట్టర్లు ధ్వంసం కావడంతో వరదనీరు తిరిగి మూసీ నదిలోకి వృథాగా వెళుతోంది. ఫలితంగా ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం అత్యంత కనిష్టానికి పడిపోయి ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు.

ప్రాజెక్టు నీటిని అక్రమంగా ఎగువకు తరలించడంతో...

శాలిగౌరారం ప్రాజెక్టులో ఉన్న నీటిని ప్రాజెక్టు సమీపంలో తవ్విన బావుల ద్వారా అక్రమంగా ఎగువకు తరలిస్తుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. దీనికి తోడు ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి సరఫరా జరిగే ప్రధాన కుడి, ఎడమ కాల్వల వెంట ఉన్న అక్రమ విద్యుత్ మోటార్ల ద్వారా ఎగువకు నీటిని తరలిస్తుండడంతో ఆయకట్టుకు భూములకు సాగునీరందలేని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా ఆయకట్టు రైతులు పంటలు తీరా చేతికందే సమయంలో ఎండిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది.

రెండు అడుగుల నీటి నిల్వ..

శాలిగౌరారం ప్రాజెక్టు 1200 ఎకరాల విస్తీర్ణంలో 21 అడుగుల నీటి సామర్థ్యంతో 5వేల ఎకరాల ఆయకట్టు కలిగి ఉంది. కానీ ప్రస్తుతం కేవలం శాలిగౌరారం, తిరుమలరాయునిగూడెం, రామగిరి, శాలిలింగోటం గ్రామపంచాయతీల పరిధిలోని పంట భూములకు కూడా సాగునీరందడం లేదు. 5 వేల ఎకరాల ఆయకట్టు అమాంతం 1500 ఎకరాలకు పడిపోయిందంటే సాగునీటి పరిస్థితి ఏవిధంగా ఉందో ఊహించవచ్చు. 21 అడుగుల నీటి సామర్థ్యం కలిగిఉన్న ప్రాజెక్టులో ప్రస్తుతం 2 అడుగుల దిగువకు నీటిమట్టం పడిపోయి డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ప్రాజెక్టు ప్రధాన కాల్వల వద్ద లోపలి భాగంలో మట్టి పేరుకుపోవడంతో ప్రాజెక్టులో ఉన్న కొద్దిపాటి నీరు తూముల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండాపోయింది.

నీటి వృథాను పట్టించుకునేవారు కరువు..

ప్రస్తుతం మూసీనది నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చే రాచకాల్వ ద్వారా వరదనీరు ప్రవహిస్తోంది. కానీ తుర్కపల్లి వద్ద రాచకాల్వకు ఉన్న షట్టర్లు ధ్వంసం కావడంతో రాచకాల్వలో వచ్చే వరద నీరంతా తిరిగి మూసీ నదిలోకి వృథాగా పోతోంది. దీంతో శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు రావడం లేదు. ఇక్కడ సాగునీటి కోసం ప్రాజెక్టు ఆయకట్టు రైతులు అరిగోస పడుతుండగా.. అక్కడ వరదనీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సాగునీటి పరిస్థితిని పర్యవేక్షించాల్సిన నీటి పారుదల శాఖ అధికారులు శాలిగౌరారం ప్రాజెక్టు గురించి ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రాజెక్టు ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

కంకి దశలో పశువులకు వదిలేశా



శాలిగౌరారం ప్రాజెక్టు కింద నాకున్న నాలుగున్నరెకరాల పొలంలో వరి సాగు చేశా. పంట కంకిదశకు వచ్చే వరకు అష్టకష్టాలు పడి పంటను కాపాడా. ఇంతలోనే ప్రాజెక్టులో నీరు లేకపోవడం, ఉన్ననీరు కాల్వల్లో ప్రవహించకపోవడంతో ప్రస్తుత ఆయకట్టుకు చివరగా ఉన్న నా పంట భూమికి నీరందడం లేదు. పంట మొత్తం నిలువునా ఎండిపోవడంతో విధిలేక పశువులను మేపేందుకు వదిలివేశా. ప్రాజెక్టును నమ్ముకొని పంటసాగు చేసి రూ. 1.30 లక్షలు నష్టపోయి అప్పులపాలయ్యా.

–గోనె శేఖర్‌రెడ్డి, రైతు, అడ్లూరు

బీజేపీతోనే పేద ప్రజల ఆర్థిక అభివృద్ధి


మునుగోడు: నియామక పత్రాలు అందిస్తున్న పెంబళ్ల జానయ్య

మునుగోడు: కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశంలోని పేద ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పలివెల, కొరటికల్, చీకటిమామిడి తదితర గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి నూతన బూత్ కమిటీలు ఎన్నుకుని నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి స్థానం నుంచి బరిలో నిలిచిన బూర నర్సయ్య గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బొడిగే అశోక్ గౌడ్, నాయకులు పుల్కరం సైదులు, బండారి యాదయ్య, కర్నాటి లింగయ్య, మాదగోని నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించాలని ప్రచారం

కేతేపల్లి: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు ఆదివారం కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు తర్నోజు నర్సింహాచారి, మల్లేష్, పొడిచేటి రవి, వెంగలి గోపి, ఉపేందర్, జానీ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


కనగల్: బచ్చన్నగూడెంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ జయరాం

కనగల్: ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ జయరాం కోరారు. ఎం గౌరారం, కనగల్, బచ్చన్నగూడెం, పగిడిమర్రి, వేమిరెడ్డిగూడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎంపీడీఓ ప్రారంభించి మాట్లాడారు. రైతులు శుభ్రపరచిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. ఆధార్, పట్టా పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలు, మొబైల్ నంబర్‌ను నిర్వాహకులకు అందజేయాలని సూచించారు. క్వింటా ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2183 చొప్పున ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఏపీఎం సంకు హరి, మండల సమాఖ్య ప్రతినిధులు ధనలక్ష్మి, స్వాతి, సీఆర్‌పీ జానకి, సీసీలు విజయ కుమారి, ప్రభాకర్, వసంత, కమిటీ ప్రతినిధులు మాధవి, సునీత, కె రేణుక, పద్మ, రేణుక, వీఓఏలు పాల్గొన్నారు.

ఏచూరి శ్రీనివాస్‌కు నివాళి

నల్లగొండ టూటౌన్: జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఆదివారం ఏచూరి శ్రీనివాస్ 47వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ చిత్రపటానికి ఏబీవీపీ జాతీయ మాజీ అధ్యక్షుడు పుట్టి మురళీమనోహర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ ప్రముఖ ప్రమోద్‌కుమార్, అంబాల సత్తయ్య, ఆవుల సంపత్ కుమార్, నవీన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి


సర్టిఫికెట్లు పొందినవారితో సంస్థ ప్రతినిధులు

రామగిరి(నల్లగొండ): మహిళలు టైలరింగ్‌లో శిక్షణ తీసుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొంది స్వశక్తితో ఎదగాలని జన శిక్షణ సంస్థాన్, మాతృశ్రీ స్వచ్ఛంద సంస్థల జిల్లా సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో తిప్పర్తి మండలం పజ్జూరు, ఎర్రగడ్డలగూడెం గ్రామాల్లో సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం ఆయా గ్రామాల్లో ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నేటి మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. గొప్పగొప్ప మహిళల విజయ గాథలను స్ఫూర్తిగా తీసుకుని గ్రామీణ మహిళలు కూడా వివిధ రంగాల్లో రాణించాలన్నారు. మహిళలు గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయాల్లో కుట్టు శిక్షణ పొందడం ద్వారా తమ పిల్లల దుస్తులను సొంతంగా కుట్టుకుంటూ డబ్బులను ఆదా చేయవచ్చన్నారు. అనంతరం 50 మంది మహిళలు, యువతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పజ్జూరు గ్రామ మహిళలు సంస్థ ప్రతినిధులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పజ్జూరు మాజీ సర్పంచ్ మోయిజ్, సంస్థ టైలరింగ్ టీచర్ గురులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నిలయం టౌన్ షిప్ ప్రారంభం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నల్లగొండ రూరల్ : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లి పోలీస్ బెటాలియన్ ఎదురుగా ఉన్న ఎస్ఎన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శ్రీ నిలయం టౌన్ షిప్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ డీటీసీపీ లేఅవుట్‌తోపాటు విశాలమైన సీసీ రోడ్లు, ప్రహరీ, గ్రీనరీ, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వాటర్ పైప్‌లైన్ వంటి సదుపాయాలతో వెంచర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే ధరల్లోనే వెంచర్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేనేజింగ్ పార్ట్‌నర్లు వేనేటి శ్రీనివాసరెడ్డి, బత్తుల అనంతరెడ్డి, కాసాల నర్సిరెడ్డి, బాలాజీనాయక్, నవీన్, డాక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవే 'సంఘమిత్ర' లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

నల్లగొండ టౌన్ : ఖాతాదారుల సేవే లక్ష్యంగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందుతున్నామని సంఘమిత్ర కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఫౌండర్ సంగం రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన 51వ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంఘమిత్ర బ్యాంక్ 1035 మంది వాటాదారులతో రూ.133.13 లక్షల వాటా ధనం కలిగి ఉందన్నారు. 2974 మంది డిపాజిట్‌దారులతో రూ.78.29 కోట్ల డిపాజిట్లు సేకరించినట్లు తెలిపారు. మొత్తం వ్యాపారం రూ.136.84 కోట్లకు పైగా ఉందన్నారు. సన్నిదానం చక్రపాణి, మహ్మద్ షరీఫ్, పున్న చండికేశ్వర్, కొంగరి భిక్షం, గజ్జల వెంకటేశ్వర్లు, గుండ అంజిరెడ్డి, బండ భిక్షంరెడ్డి, ఎర్రమల్ల లక్ష్మీనర్సు, చెరిపల్లి పద్మ, వీరవెల్లి భవాని, జెల్ల శ్రీశైలం, అద్దంకి లక్ష్మయ్య, మహ్మద్ నజీరొద్దీన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

నల్లగొండ టూటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు సాజీద్ అలీ సంస్మరణ సభ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. సాజీద్ అలీ చిత్రపటానికి జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సాజీద్ అలీ కుటుంబానికి రూ.80 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, కే మురళి, దుబ్బ ఆనంద్, ఆర్ నాగేశ్వరరావు, కే.వెంకట్రావిఎరెడ్డి, బొమ్మపాల గిరిబాబు, అలీ, శ్రీకాంత్ రెడ్డి, విజయపాల్, విజయ్, శ్రీనివాస్, రఫీ, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబంలో సంవత్సరంలోపే భర్తను, కొడుకును పోగుట్టుకున్న శాలిగౌరారం ఎస్సీ కాలనీకి చెందిన ఎలిజాల భిక్షమమ్మకు స్థానికులు రూ.16,500 ఆర్థికసాయం అందజేశారు. అనాథ అయిన ఎలిజాల భిక్షమమ్మ కుటుంబానికి ఆర్థికసాయం చేయాలని కాలనీకి చెందిన వార్డు మెంబర్ గుండ్ల సురేష్ స్థానిక వాట్సాప్ గ్రూపులో పోస్టు పెట్టాడు. స్పందించిన స్థానికులు తమకు తోచిన విధంగా ఆర్థికసాయం చేశారు. వచ్చిన డబ్బులను భిక్షమమ్మకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో గుండ్ల సురేష్, గుండా శంకర్, గంట మహేష్, బండారు రఘు, తమ్మిశెట్టి వెంకటేష్, బండారు శేఖర్, బండారు లింగయ్య, సుంచు ముత్తయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: మండల కేంద్రానికి చెందిన మేర ధనయ్య (45) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాంపల్లికి చెందిన గజ్జల శివారెడ్డి బాధిత కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

చిట్యాల మీదుగా కేసీఆర్ కాన్వాయ్

చిట్యాల: ఎండిన వరి పొలాలను పరిశీలించేందుకు సూర్యాపేట జిల్లాకు వచ్చిన మాజీ సీఎం కేసీఆర్ తిరుగు ప్రయాణంలో ఆదివారం రాత్రి చిట్యాల మీదుగా వెళ్లారు. కాగా చిట్యాలలో కేసీఆర్‌కు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. కేసీఆర్ కారులో నుంచే పార్టీ నాయకులకు అభివాదం చేస్తూ వెళ్లారు. స్వాగతం పలికిన వారిలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి, నాయకులు కర్నాటి ఉప్పల్‌రెడ్డి, కందాటి రమేష్‌రెడ్డి, తుమ్మల నాగరాజురెడ్డి, పర్నే నరేందర్‌రెడ్డి, అర్రూరి శ్రీశైలం, వీసం బాబు, మర్రి జలంధర్‌రెడ్డి ఉన్నారు.

చర్చిల్లో ఘనంగా ఈస్టర్ వేడుకలు


నల్లగొండ: గ్రేస్ ఇవాంజెలికల్ బాప్టిస్ట్ చర్చిలో వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు


నల్లగొండ పట్టణంలోని షాలోం వర్షిప్ సెంటర్‌లో ..

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పలు చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా గ్రేస్ ఇవాంజెలికల్ బాప్టిస్ట్ చర్చిలో రెవరెండ్ డాక్టర్ మోజస్ ఆధ్వర్యంలో పునరుద్ధాన సందేశం చేశారు. కార్యక్రమంలో విలియం కేరి, ఆనందమయ, శేఖర్, సురేష్, సుదర్శన్, ఫిలిప్స్, పవన్, ప్రవీణ, నాగరాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సెంటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ చర్చ్‌లో..

సెంటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ తెలుగు బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కాలేబు, రెవరెండ్ డాక్టర్ సీనియర్ ఈస్టర్ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ఫాదర్స్ సెవెన్ సిస్టర్ సునీత, పసల శౌరయ్య, టీఎస్ విలియమ్స్, ఆశయ్య, ఎలిషా, ఆనంద ప్రసాద్, అప్పలూమ్, కృపానందం, సర్వోదయమని, ప్రభు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కల్వరి కరుణ చర్చిలో..

మర్రిగూడ బైపాస్ రోడ్డులోని కల్వరి కరుణ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ డాక్టర్ వినాయకరావు పునరుద్ధాన సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో బిషప్ సమర్పన్ కుమార్, డాక్టర్ ఝాన్సీరాణి, చైతన్య, అరవింద్, కిరణ్, జెస్సి, మమత తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీ షాలోం వర్షిప్ సెంటర్‌లో..

హైదరాబాద్ రోడ్డులోని సుందరయ్య కాలనీ షాలోం వర్షిప్ సెంటర్‌లో బిషప్ సుధీర్‌కుమార్ ఏసు క్రీస్తు పునరుద్ధాన సందేశాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జ్యోతి ప్రిస్కిల్లా, శేఖర్, ముత్తు, కమలడేవిడ్ రాజ్, లాజరస్, మాణిక్యం, ప్రభుదాస్, కిరణ్ పాల్గొన్నారు.

కవనెంట్ చర్చిలో...

పట్టణంలోని ఐటీఐ వద్ద గల కవనెంట్ చర్చిలో ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ సాల్మన్ ప్రత్యేక సందేశాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రూతురాజు, సుగుణ, మారయ్య, రాజశేఖర్, లక్ష్మి పాల్గొన్నారు.

కేతేపల్లి: ఈస్టర్ వేడుకలను మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఇనుపాముల, కేతేపల్లి, భీమారం, రాయపురం, చెర్కుపల్లి తదితర గ్రామాల్లో ఉన్న చర్చిల్లో ఈస్టర్ సందర్భంగా ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేతేపల్లిలోని జపమాలమాత చర్చి, రాయపురంలోని పునీత రాయప్ప, భీమారం చర్చిలలో శనివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి బాణాసంచా కాల్చారు. కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ఆయా చర్చిల మత గురువులు ఫ్రాంచీస్, జోసెఫ్, చర్చి కమిటీ ప్రతినిధులు మాదాను బాలస్వామి, పసల ఆరోగ్యం, మాదాను విజయరాజు, పొలిశెట్టి జోజప్ప, పసల జోజప్ప, బందా జోసెఫ్, జయరాజు, అమర్‌కుమార్, కాటా విజయ్‌పాల్, గుప్పింటి రాయప్ప, పసల ధనరాజ్, శౌరి పాల్గొన్నారు.

కట్టంగూర్ : ఈస్టర్ పర్వదిన వేడుకలను మండలంలోని క్రైస్తవులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కట్టంగూర్, చిన్నపురి, ముత్యాలమ్మగూడెం, అయిటిపాముల గ్రామాల్లో గల చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఫాదర్ గ్రెగోరి, పాస్టర్ అబ్రహం, చెరుకు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, భాస్కర్, నాగేష్, భిక్షం, రాజు, చెరుకు సైదులు, మల్లయ్య, యాదయ్య, సురేష్ పాల్గొన్నారు.


నల్లగొండ పట్టణంలోని కవనెంట్ చర్చిలో ..


నల్లగొండ పట్టణంలోని కల్వరి కరుణ చర్చిలో..


కేతేపల్లి చర్చిలో..


నల్లగొండలోని సెంటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో..

మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న వంగూరి రాఖీ

నల్లగొండ టూటౌన్: బీజేపీ ఎమ్మెల్యేలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌కు వెన్నుపోటు పొడిచేది కోమటిరెడ్డే అని అన్నారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఎవరు కోవర్టుగా మారారో ప్రజలందరికీ తెలుసన్నారు. మునిగిపోయే నావలా ఉన్న కాంగ్రెస్‌లోకి ఒక్క బీజేపీ ఎమ్మెల్యే కూడా పోరని తెలిపారు. ఈ సమావేశంలో భరత్, దుబ్బాక సాయి, నరేష్, గడ్డం మహేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీరేశం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: మున్సిపల్ కేంద్రంలోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే వేముల వీరేశం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గాజుల సుకన్య, పన్నాల పావని శ్రీనివాస్‌రెడ్డి, చౌగోని రజిత, యాసారం లక్ష్మీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం మహిళా విభాగం రాష్ట్ర కమిటీ ఎన్నిక

నకిరేకల్: నకిరేకల్‌లో జరిగిన తెలంగాణ రైతు సంఘం మహిళా విభాగం రాష్ట్ర సదస్సులో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రైతు సంఘం మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నకిరేకల్‌కు చెందిన కందాల ప్రమీల, కో–కన్వీనర్‌గా సూర్యాపేటకు చెందిన కొప్పుల రజిత ఎన్నికయ్యారు.

వైభవంగా రథోత్సవం

నాంపల్లి : మండలంలోని మహ్మదాపురం గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి హోమం నిర్వహించారు. అనంతరం భక్తులు రథాన్ని లాగారు. కార్యక్రమంలో ఈఓ జయరామయ్య, పున్‌రెడ్డి దిలీప్, ఆలయ పూజారి రంగాచార్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు